క్లుప్తంగా

వినుకొండలో డీఎల్‌పీవో తనిఖీలు



వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రమైన నూజెండ్లలోని మీసేవ కేంద్రాన్ని డీఎల్‌పీవో, జిల్లా మీసేవ విజిలెన్స్ అధికారి ఎం.వెంకట రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, సేవల వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేడు జాబ్ మేళా



వినుకొండ(నూజెండ్ల): నవోదయ మైత్రి సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గుర్రం జాషువా కళా ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కూకట్లపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. మొత్తం 15 కంపెనీల్లో 500 ఉద్యోగాల నియామకం జరుగుతుందని, 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత విద్యా సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డును వెంట తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, పిడుగు విజయ్, పి.త్రికోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పునఃపరిశీలన



నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్లలో మంగళవారం ఓటర్ల జాబితా పునః పరిశీలన నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, పొడా వైస్‌చైర్మన్ డాక్టర్ గజ్జల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రమణా నాయక్‌లు పరిశీలనలో పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తొలగించిన ఓటర్ల జాబితాపై అధికారులు విచారణ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. మృతి చెందిన, డబుల్ ఎంట్రీ ఓట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వి.శివప్రసాద్, వీఆర్‌ఓలు భాస్కర రెడ్డి, పార్వతీశం, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉపాధికి దరఖాస్తు చేసుకోండి



శావల్యాపురం: 2018 నుంచి 2023 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకంలో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసిన కుటుంబ సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా నిరుద్యోగ యువతీ–యువకులకు ఉపాధి అవకాశాలు కోసం దరఖాస్తులు చేసుకోవాలని జాబ్స్ కోఆర్డినేటరు కె.వీరస్వామి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి క్షేత్ర సహాయకులు, వంద రోజుల పూర్తి చేసుకున్న వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ ఉన్నతి పథకంలో ద్వారా 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు 10 తరగతి నుంచి డిగ్రీ పూర్తి అయిన వారందరూ సమగ్ర సమాచారంతో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత పొందిన వారికి ఉచితంగా శిక్షణతో పాటు భోజన వసతి నాలుగు నెలలు పాటు కల్పించి తదుపరి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సదస్సులో ఏపీవో కె. రామారావు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, టీఏలు శ్రీనివాస గుప్తా పాల్గొన్నారు.

రొంపిచర్లలో భారీ వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా వర్షం కురిసింది. వర్షం ఉదయం నుంచి ప్రారంభమై రాత్రి వరకు కురుస్తూనే ఉంది. అప్పుడప్పుడు పెద్ద వర్షం కురుస్తూ ఈ వర్షం కొనసాగింది. అయితే వర్షానికి తోడు గాలులు లేకపోవటంతో ఎలాంటి నష్టం జరగలేదు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగలేదు.

వివాహిత ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జాకీర్‌హుస్సేన్ వీధి బెల్జియం కంపెనీ సమీపంలో నివాసం ఉండే సయ్యద్ రఫీ మూడు సంవత్సరాల కిందట మంగళగిరికి చెందిన సయ్యద్ కరిష్మ (23)తో వివాహమైంది. వీరికి ఒకటిన్నర సంవత్సరాల బాబు. అయితే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ ఎం.మోహన్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.



నరసరావుపేటలో ప్రొఫెసర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న అధ్యాపకులు



సర్వేపల్లి చిత్రానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న శ్రీరామా పబ్లిక్ స్కూలు ఉపాధ్యాయులు



వినుకొండ గీతమ్స్ పాఠశాలలో టీచర్స్‌డే వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



వినుకొండ నిర్మలా స్కూల్లో విద్యార్థులకు ఆశీస్సులు అందిస్తున్న ఉపాధ్యాయులు



కంభంపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి

చిలకలూరిపేట: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ పొట్టి శ్రీరాములు, అధ్యాపకుడు బండ్ల శ్రీనివాసరావును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత నిర్వర్తించే ఉపాధ్యాయులు స్ఫూర్తి ప్రదాతలని కొనియాడారు. సమాజంలో అక్షరాస్యత పెంచేందుకు దేశాన్ని ప్రగతి పథంలో నడిపే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్, బైరా వెంకటకృష్ణ, విడదల కమలేంద్ర, తోట బ్రహ్మస్వాములు, కౌన్సిలర్ బిట్రా రాజేంద్ర ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్‌రావు, గట్టా హేమ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంజీలో...

ఏఎంజీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంజీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైస్కూల్, ప్రైమరీ స్కూల్, డిగ్రీ, జూనియర్ కళాశాల, ఐటీఐ, నర్సింగ్ స్కూల్‌లలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. వారికి క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఎండోమెంట్ మాజీ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి చెప్పారు. యడ్లపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం సర్వేపల్లి జయంతి వేడుకలు జరిగాయి. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ చేకూరి అంజమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశానికి రెండో రాష్ట్రపతి, మొదటి ఉపరాష్ట్రపతి వ్యవహరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ మంచి రాజకీయవేత్త, తత్త్వవేత్త అన్నారు. ప్రతి గురువు సర్వేపల్లిని స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తాడన్నారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, దేసు సురేష్, యామర్తి కోటేశ్వరరావు, ఎం.సుధాకర్, షేక్ అహమ్మదుల్లా, వై సంజీవరావు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లక్ష్మీతులసీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

యడ్లపాడు: బోధనా రంగంలో పాతికేళ్లుగా విభిన్న రీతుల్లో విద్యతో పాటు వివిధ విభాగాల్లో విద్యార్థులకు ఎన్నో సేవలను అందించిన ఆలోకం లక్ష్మీతులసీకు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు లభించింది. యడ్లపాడు మండలం జాలాది గ్రామంలోని ఏపీ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఆలోకం లక్ష్మీతులసీ నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్లో డీఈవో శామ్యూల్ అధ్యక్షతన జరిగిన గురుపూజోత్సవం వేడుకల్లో పల్నాడు జిల్లాకలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈకార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ హెన్రీక్రిస్టినా, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ఈ సందర్భంగా తులసీను సత్కరించారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకుంటున్న ఆలోకం లక్ష్మీతులసీ

శావల్యాపురంలో....

శావల్యాపురం: మండలంలోని పొట్లూరులో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శింగంశెట్టి అన్నపూర్ణమ్మ తొలుత డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సమాజానికి దిశ నిర్దేశం కలిగించే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే ఉపాధ్యాయులకు నిజమైన ఆనందం కల్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో విద్యార్థులను సృజనాత్మకంగా తీర్చిదిద్దే పాత్ర ఉపాధ్యాయులదేనని శ్రీరామ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చందు అన్నారు. తొలుత డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపటి సమాజానికి భావిభారత పౌరులుగా తయారు చేసే ఉపాధ్యాయులను గౌరవించుకోవటం మన అందరి కర్తవ్యమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ కె.రత్నకుమారిని పాఠశాల విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అజిత్‌చంద్, ఉపాధ్యాయులు మస్తాన్‌బీ, మనీషా పాల్గొన్నారు.

నరసరావుపేటలో....

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని వివిధ విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావును కళాశాల సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్ బాబు, వ్యాయామ సంచాలకుడు డాక్టర్ జీ.పి.రాజు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య ఆధ్వర్యంలో ఆంధ్రోపన్యాసకుడు డాక్టర్ కాకాని సుధాకర్, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో తొమ్మిది మంది రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి గుమ్మడి రాఘవయ్య, జాయింట్ సెక్రెటరీ పి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాల అధిరోహణే గురుదక్షిణ



బండ్లమోటులో సర్వేపల్లి చిత్రానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బొల్లాపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బండ్లమోటు హైస్కూల్ హెచ్‌ఎం అపర్ణ మాట్లాడుతూ తొలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని గురుపూజోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతశిఖరాలు అధిరోహించడంతో పాటు ఉత్తమంగా స్థానం సంపాదించుకోవడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గురుదక్షిణ అని అన్నారు. ఈ సందర్భంగా గురువులను శిష్యులు సత్కరించారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గీతమ్స్ పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.కోటిరెడ్డి హాజరై గురువును గౌరవించడం భారతీయ సంప్రదాయంలో భాగమని, ప్రతిఒక్కరూ గురువును పూజించి గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో....

చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో టీచర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సంస్థ నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వర్లుతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మలా స్కూల్లో...

నిర్మలా ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం చిన్ని, కరస్పాండెంట్ డేనిస్ పాల్గొని టీచర్స్‌డే ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల ఆశీస్సులను విద్యార్థులకు అందజేశారు.

నూజెండ్ల మండలంలో....

నూజెండ్ల మండలంలో టీచర్స్ వేడుకలు పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన నూజెండ్ల జెడ్పీహెచ్ పాఠశాల, కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, గొల్లపాలెం ఎంపీపీ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీచర్స్ డే విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యడ్లపాడు శాఖా గ్రంథాలయంలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పరిశోధనలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

నరసరావుపేట రూరల్: యువత వైజ్ఞానిక పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకోవాలని బృందా న్యూరో కేర్ సెంటర్ న్యూరో చీఫ్ సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఫార్మా–డి విద్యార్థులకు న్యూరాలజీ విభాగంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరుకావడం ద్వారా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత వైద్యవిధానంలో ఫార్మసీ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అంది పుచ్చుకునేందుకు సంసిద్ధులై ఉండాలని సూచించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి మాట్లాడుతూ కళాశాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిశోధన విభాగం అనుమతులు లభించినట్టు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు వారి పరిశోధనలను త్వరితగతిన పూర్తిచేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం సీవీ రామన్ అవార్డు గ్రహీత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ భవనం ఆంజనేయ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్ రావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ ఎంఎల్ సురేఖ, అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఏఎంరెడ్డి కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి

నూతన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

నాదెండ్ల: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఆరునెలలకోసారి అర్హులైన వారికి వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. మండల పరిధిలో నూతనంగా 406 మందికి పెన్షన్లు మంజూరు కాగా మొదటి దఫా మంగళవారం 220 మందికి నగదు అందించారు. మిగిలిన వారికి మరో వారం రోజుల్లో అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం 9361 మందికి గాను రూ.2,58,14,000లు నగదును ప్రతినెలా వలంటీర్లు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతనంగా పింఛను మంజూరు కావాలంటే అదే ఇంట్లో ఎవరో ఒకరి పింఛను తొలగించే వారన్నారు. లేదంటే ఆ ఇంట్లో ఎవరైన మృతి చెందితేనే వారి స్థానంలో కొత్త పింఛను ఇచ్చేవారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం నాలుగురెట్లు ఎక్కువ పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఎంపీటీసీ యల్లారావు, అంకమ్మ, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

అమరావతి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు నిర్మూలించి, బాలల హక్కులు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యతని గుడ్‌షెఫర్డ్ సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి అన్నారు. మంగళవారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ మీటింగ్ హాల్‌లో బాల్య వివాహాలపై బాలల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంస్థ కో–ఆర్డినేటర్ లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈసదస్సులో సుపీరియర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ బాలల హక్కులు, చైల్డ్‌లైన్ 1098 గురించి వివరించారు. రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లలకు 24 గంటలు సహాయపడే ఉచిత టెలిఫోన్ నెంబర్ 1098 కి ఫోన్ చేయవచ్చన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా చదువుకోవడానికి అవకాశాలు కల్పిస్తుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను సంస్థ నిర్వహిస్తుందని, విద్యార్థులను ఈ కోర్సులలో చేర్పించి, వారికి ఉపాధి లభించే విధంగా చూడాలన్నారు. సంస్థ సిబ్బంది బత్తుల బాబు పవన్, మరియమ్మ, బ్యూలా, పలువురు మహిళలు పాల్గొన్నారు

పంట నమోదు వేగవంతం చేయాలి



నాదెండ్ల: ఖరీఫ్‌లో పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఈకేవైసీ చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళీ చెప్పారు. నాదెండ్ల రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆర్‌బీకేల్లోని వివిధ రిజిస్టర్లలో పంట నమోదు, ఎరువుల అమ్మకాలు పరిశీలించారు. ఆర్‌బీకేల్లోని ఎరువుల నిలువలు పరిశీలించారు. చందవరం గ్రామ పరిధిలో మిరప నాట్లను వేస్తున్న రైతులతో మాట్లాడారు. మిర్చి సాగు చేస్తున్న రైతులు ఆరుతడులకు నీటి సౌకర్యం ఉంటేనే సాగుకు ఉపక్రమించాలన్నారు. నీటి సౌకర్యం లేని రైతులు కంది, శనగ తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో రైతులకు బీమా, పరిహారం తదితరాలు ప్రభుత్వం నుంచి అందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ, స్థానిక ఏవో హరిప్రసాద్, సహాయకులు అనుపమ, వెంకటేష్, కోటంరాజు ఉన్నారు.

మహిళా సభ్యులు ఎ–గ్రేడ్‌లో ఉండేలా చర్యలు

జిల్లా వైఎస్సార్ క్రాంతి పథకం డీపీయం బొల్లెపల్లి శ్రీలక్ష్మి

శావల్యాపురం: స్వయం సంఘాల్లోని మహిళ సభ్యులు సుస్థిర జీవనోపాధులు పెంపుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా వైఎస్సార్ క్రాంతి పథకం డీపీయం బొల్లెపల్లి శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ పథకంలో భాగంగా గ్రామ సమాఖ్య సంఘాలోని సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా డీపీయం మాట్లాడుతూ జాతీయ గ్రామీణ మిషన్ పథకంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో 10 మండలాలను ఎంపిక చేయగా అందులో శావల్యాపురం మండలం ఉందన్నారు. మండలంలోని 990 గ్రూపులు, 24 గ్రామ సంఘాలు ఉండగా వాటి సమగ్ర వివరాలన్నీ లోకస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. స్వయం సహాయక మహిళా సభ్యులు స్థితిగతులు మెరుగుదలకు కృషితో పాటు గ్రూపులన్నీ ఎ–గ్రేడ్‌లో వచ్చేలా వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు గ్రామ సమాఖ్య సభ్యులు కీలకపాత్రలు పోషించాలన్నారు. నెలవారి సమావేశాలు, బ్యాంకు లింకేజీ, పుస్తక నిర్వహణ తదితర వాటిపై అవగాహన కల్పించటంతో పాటు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సభ్యులకు చైతన్యం పెంపొందించాలన్నారు. లోకస్ యాప్‌లో నమోదు చేయడం వల్ల రానున్న రోజుల్లో గ్రూపులకు మెరుగైన సేవలతో రుణాలు నిధులు మరింత పెంపుదలకు అవుతాయన్నారు. అనంతరం అడవి పేరంటాళ్లమ్మ గ్రామసంఘంలో సాయిబాబా, ప్రసన్నాంజనేయ మహిళా గ్రూపులను ఎంపిక చేసి గ్రూపు సభ్యులతో ఎ–గ్రేడు వచ్చే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈనెలాఖరులోగా అన్నీ గ్రూపులకు శిక్షణా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గంజనబోయిన నారాయణమ్మ, ఏపీఎం గుమ్మడిజిల్లా వాసుబాబు, శిక్షణ తరగతులు రిసోర్స్ పర్సన్స్ పాపమ్మ, కోటేశ్వరరావు, సీసీలు గొట్టం రమాదేవి, ఖాజావలీ, బేబి రాణి, గ్రామసంఘం అధ్యక్షురాలు ఎస్. కోటేశ్వరమ్మ, మంది వీవోఏలు పాల్గొన్నారు.



యాప్‌లో నమోదు ప్రక్రియపై వివరిస్తున్న శ్రీలక్ష్మి

వీధి కుక్కల దాడిలో లేగదూడకు గాయాలు

నాదెండ్ల: గ్రామాల్లో రోజు రోజుకు వీధి కుక్కల బెడద ఎక్కువౌతోంది. మేజర్ పంచాయతీ గణపవరంలో గడిచిన కొద్ది నెలల క్రితం సుమారు 10 దూడలు కుక్కల దాడిలో మృతి చెందగా, మరో రెండు చోట్ల గొర్రెల పాకలో చొరబడి గొర్రె పిల్లలను చంపి తినేసిన సంఘటనలు జరిగాయి. తాజాగా సోమవారం అర్ధరాత్రి పశువుల ఆసుపత్రి వీధిలో ఉన్న రైతు పెడవల్లి రామారావుకు చెందిన లేగదూడపై వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో లేగదూడకు గాయాలుకాగా కుడి చెవిని పూర్తిగా తినేశాయి. లేగదూడ అరుపులకు రైతుల రామారావు అక్కడకు చేరుకుని కుక్కలను తరిమేశాడు. మంగళవారం ఉదయం స్థానిక పశువుల ఆసుపత్రిలో వైద్యం చేయించారు. కుక్కల బెడదను నివారించాలని పంచాయతీ అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు.

కాలభైరవుడికి విశేషపూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులోని కాల భైరవ విగ్రహానికి మంగళవారం భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈసందర్భంగా కూష్మాండ దీపారాధనలు చేసి అష్టోత్తర, శతనామ కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమాలను లక్ష్మీనారసింహస్వామి ఆలయ ధర్మకర్త ఎం.సుబ్బారెడ్డి, వెంకట రమణమ్మలు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.